క్లుప్తంగా

నెలాఖరులోగా నాడు - నేడు పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ గౌరినాయుడు

వీరఘట్టం: నాడు – నేడు రెండో విడతలో చేపట్టిన పాఠశాల అభివృద్ధి పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంఈఓ డి.గౌరినాయుడు సూచించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. నాడు – నేడుతో పాటు యు డైస్ ప్లస్, ఎండీఎం, ట్యాబ్స్, ఐఎఫ్‌పీ ప్యానెల్స్ తదితర అంశాలపై హెచ్‌ఎంలతో చర్చించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ సూచించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల వారీగా తాగునీటి వనరులు, వాటి పరిస్థితిపై సమీక్షించారు. ముందస్తుగా చర్యలు తీసుకోవాల్సిన గ్రామాల సమాచారం అందించాలన్నారు. ప్రిజమ్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సర్వే సక్రమంగా చేపట్టాలన్నారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారి వివరాలు అందించాలని సూచించారు.

కళ్ల రక్షణకు జాగ్రత్తలు పాటించాలి



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కృష్ణారావు

పాలకొండ రూరల్: శరీర భాగాల్లో సున్నితమైన కళ్ల రక్షణకు అవసరమైన జాగ్రత్తలు ప్రతి ఒక్కరూ పాటించాలని పారా మెడికల్ నేత్ర వైద్యాధికారి టి.కృష్ణారావు అన్నారు. స్థానిక బాసూరువారి వీధిలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా గురువారం ఇంటింటా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. అక్కడి సచివాయం వద్ద ప్రత్యేక కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాలైన కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించారు. 14 మందికి కంటి అద్దాలను అందించారు. ఐదుగురిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల వద్దకే నిపుణులైన వైద్యులచే అందిస్తున్న సేవలను సద్వినియోగపర్చుకోవాలని అధికారులు సూచించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కుటుంబానికి రూ.3.32 లక్షల సాయం



సంపత్‌కుమార్ కటుంబ సభ్యులకు రూ.3.32 లక్షల నగదు అందజేస్తున్న ఎంఈఓలు

వీరఘట్టం: మండల విద్యాశాఖ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్న నులకజోడు సంపత్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు, ఉపాధ్యాయ సంఘాలు, మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్‌పీలు ఆ కుటుంబానికి సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. అందరూ కలసి రూ.3.32 లక్షలు పోగు చేశారు. ఈ డబ్బులను బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి గురువారం సంపత్‌కుమార్ కుటుంబ సభ్యులకు ఈ చెక్ అందజేశారు. ఈ డబ్బులను సద్వినియోగం చేసుకుని పిల్లలను చక్కగా చదివించాలని సంపత్‌కుమార్ భార్యకు సూచించారు.

బీజేపీని గద్దె దించాలి

కురుపాం: దేశం సమైక్యంగా ఉండాలంటే బీజేపీని గద్దె దించాల్సిందేనని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.తులసిదాసు అన్నారు. కురుపాంలో ఆ పార్టీ ఎన్నికల విస్తత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో సీపీఎం తరఫున అభ్యర్థి బరిలో ఉంటారన్నారు. బీజేపీతో జత కట్టిన పార్టీలకు ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన సీపీఎం నాయకులు సుబ్బరామమ్మ, కృష్ణమూర్తి, వేణు, మన్మధరావు, అవినాష్, రమణ, గంగునాయుడు, తిరుపతిరావు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి
- రూ.1.75 కోట్లతో 2.5 కి.మీ కంచరపాడు బీటీ రోడ్డుకు శంకుస్థాపన
- రూ.1.35 కోట్లతో 1.5 కి.మీ కురుంపీట బీటీ రోడ్డు పనులకు శ్రీకారం



దేవుని గుంప బీటీ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొమరాడ: గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించి వారి అభివృద్ధితో పాటు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని రాజ్యలక్ష్మీపురం బీటీ రోడ్డు నుంచి కంచరపాడు వరకు రూ.1.75 కోట్ల వ్యయంతో 2.5 కి.మీ బీటీ రోడ్డు, శివిని నుంచి కురుంపీట వరకు రూ.1.35కోట్లతో 1.5 కి.మీ బీటీ రహదారి నిర్మాణ పనులకు ఆమె గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాటిస్తే పని చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. గిరిజనులు మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలు మారినా తమ సమస్యలు పరిష్కారం కాలేదని, ముఖ్యమంత్రి మా సమస్యలు పరిష్కరిస్తున్నారని రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, జెట్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మీ, వైస్సార్ సీపీ కన్వీనర్ డి.జనార్దనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, నాయకులు శెట్టి మధుసూదనరావు, కళింగి మల్లేశ్వర్‌రావు, మండల సచివాలయ కన్వీనర్ యేగిరెడ్డి సింహాచలం, సర్పంచులు బోనెల పుష్పలత, అంబటి వెంకటిలక్ష్మీ, మాజీ సర్పంచ్ కెంగువ పోలి నాయుడు, ఈఈ జె.శాంతీశ్వర్‌రావు పాల్గొన్నారు.

దేవుని గుంపకు రహదారి సదుపాయం కల్పించడం నా అదృష్టం

నాగవళి, జంఝావతి సంగమం మధ్య కొలువుదీరిన స్వామీశ్వరుడుకు దశబ్దాలుగా రహదారి సదుపాయ లేక భక్తులు ఎంతో ఇబ్బందులు పడ్డారని, ఈ నేపథ్యంలో ఆ స్వామీశ్వరుడు ఆలయానికి రహదారి సదుపాయం కల్పించడం నా అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని గంగారేగువలస నుంచి గుంప గదబవలస మీదుగా స్వామీశ్వరుడు ఆలయానికి కొత్తగా నిర్మాణం చేసిన తారు రోడ్డును ఆమె గురువారం ప్రారంభించారు. అనంతరం శ్రీ స్వామీశ్వరుడు ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన దేవాలయాల్లో స్వామీశ్వరుడు ఆలయం ఎంతో ప్రాముఖ్యత కలిగినదన్నారు. జగనన్న ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసి బీటీ రహదారి నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. గత నాలుగున్నరేళ్లుగా ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించి ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేనన్నారు. సర్పంచ్‌లు కోడి తిరుపతిరావు, సుంకరి సుగుణ, ఎంపీటీసి కె.పార్వతి, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ శాఖ ఈఈ శాంతీశ్వరరావు పాల్గొన్నారు.



కంచరపాడు బీటీ రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

ఉత్తమ సేవలందించాలి...



నేరడి-బిలో పథకాల పట్టిక వద్ద మద్దతు చెబుతున్న పార్టీ నాయకులు, వలంటీర్లు

భామిని: ముఖ్యమంత్రి జగనన్న మానస పుత్రులుగా భావిస్తున్న గ్రామ వలంటీర్లు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు పిలుపునిచ్చారు. మండలంలోని నేరడి బి, నులకజోడు, బురుజోల సచివాలయాల్లో మేము సిద్ధం – మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా బూత్ కమిటీ సభ్యులతో గురువారం మాట్లాడారు. అనంతరం వలంటీర్లతో సంక్షేమ పథకాల జాబితాలు, డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ప్రయోజనాలు గడప గడపకు తీసుకువెళ్లే విధానంపై చర్చించారు. పార్టీ నాయకులు అర్లి రాజశేఖర్, సరిసాబద్ర బాలయ్య, సర్పంచ్‌లు కొత్తూరు ప్రసాద్, మడపాన కేశవ, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

హడ్డుబంగి ఆశ్రమ పాఠశాల సందర్శన



హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

సీతంపేట: హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను ఎస్టీ కమిషన్ చైర్మెన్ డీవీజీ శంకరరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, విద్యార్థినుల హాజరు పరిశీలించారు. వారితో కాసేపు ముచ్చటించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ఎలా అందుతుంది, చదువులు ఎలా ఉన్నాయనేది తెలుసుకున్నారు. బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీడీ అన్నదొర, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, హెచ్‌ఎం ఉమావాణి, ఏఎంఓ కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

కురుపాంలో కేంద్ర అదనపు బలగాల కవాతు



కురుపాం మండల కేంద్రంలో కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక పోలీసు బలగాలు

కురుపాం: మండల కేంద్రంలో కేంద్ర అదనపు బలగాలు గురువారం కవాతు నిర్వహించాయి. ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ, కురుపాం ఎస్‌ఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా ఆలయం నుంచి కురుపాం మండల కేంద్రంలోని పలు వీధుల గుండా ప్రత్యేక పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలీసు బలగాలు కవాతు నిర్వహించినట్లు తెలిపారు .

అన్నదాతకు అండగా నిలుద్దాం...

- మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు



సమావేశంలో సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: అన్నదాతలకు అధికార యంత్రాగం, ప్రజాప్రతినిధులు క్షేత్ర స్థాయి నుంచి అండగా ఉండాలని ఎంపీపీ బొమ్మాళి సుదాభాను అన్నారు. గురువారం జరిగిన మండల సమావేశానికి అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ మండలంలో అధికారులు సమన్వయంతో ముందుకు సాగి మరింతగా అభివృద్ధి జరిగేలా పని చేయాలన్నారు. వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్ మాట్లాడుతూ రబీలో రైతులకు సహకరించేందుకు ఉచిత విద్యుత్ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకూ కొనసాగించాలన్నారు. పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద ఏర్పాటు చేసిన స్తంభాలు, వేలాడే వైర్ల నిర్వహణపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో అందిస్తున్న రేషన్ సరుకులు పూర్తి స్థాయిలో అందించటంలో అలసత్వం జరుగుతుందని, బియ్యం మినహాయిస్తే ఇతర సరుకులు సక్రమంగా అందించకపోవటంపై మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు ప్రశ్నించారు. గ్రామీణ కనక్టవిటి రహదారులు, గతంలో అందించిన ఫిర్యాధుల మేరకు రహదారుల మరమ్మతుల తాజా స్థితిగతులపై ఆర్ అండ్‌బీ అధికారులు సమావేశం దృష్టికి తీసుకురావాలని వాటపాగు సర్పంచ్ వి.రాజారావు కోరారు. ఉపాధి పనులు, ఉద్యానవన, వ్యవసాయ సంబంధిత పనులకు, పురోగతిపై ఆయా శాఖల అధికారులు సభ్యులకు వివరించారు. వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వం సమకూరుస్తున్న వనరులు సద్వినియోగపర్చుకుని ప్రజలకు సేవలు అందించాలని యంత్రాంగాన్ని కోరారు. సమావేశంలో శాఖల వారీగా సభ్యులు అందించిన సలహాలు, సూచనలను ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, ఈఓపీఆర్డీ కె.సూర్యనారాయణ సమోదు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సీతంపేట: చిన్నబగ్గ పంచాయతీ జరడుకాలనీలో వెలుగు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. రిసోర్స్‌పర్సన్ పాలక నాగేశ్వరరావు మాట్లాడుతూ జీడి పంటల దిగుబడికి నీమాస్త్రం, ద్రవ జీవామృతం, మజ్జిగ ఉపయోగించి దిగుబడి పెంచవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు, ఏరియా సమన్వయకర్త బి.వెన్నెల, వసంత, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

చక్రతీర్థ స్నానాలు



ఉత్సవ విగ్రహాల తిరువీధిలో పాల్గొన్న భక్తులు

భామిని: మండల కేంద్రంలో వెలసిన శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా గురువారం వంశధార నదిలో భక్తులు చక్రతీర్థ స్నానాలు కావించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో తిరువీధి నిర్వహించారు. వంశదార నదిలో చక్రతీర్థ స్నానాలు అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

పాలకొండ: స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం వారికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విద్యార్థులకు పలు సూచనలు అందించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. శాస్త్రీయ, సినీ గేయాలకు డ్యాన్స్‌లతో అలరించారు.

ప్రజల సంక్షేమమే జగనన్న ధ్యేయం



అంపిలిలో గడప గడపకు సంక్షేమం కార్యక్రమం నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ

పాలకొండ రూరల్: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ పని చేస్తున్నారని వైస్ ఎంపీపీ వాకముడి అనిల్ అన్నారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశరరావుతో కలసి గురువారం అంపిలి గ్రామంలో గడప గడపకు సంక్షేమం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆ కుటుంబానికి జగనన్న పాలనలో అందించిన లబ్ధిని వివరించారు. టీడీపీ ప్రభుత్వం మాదిరిగా సంక్షేమ లబ్ధి, పథకాల వర్తింపజేసేందుకు ప్రజలను పీడించుకుతిన్న వైనం గుర్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో పేదల, అర్హుల గడప వద్దకే సంక్షేమాన్ని అందిస్తున్న తీరును కొనసాగించేందుకు మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ఒక్కో కుటుంబానికి అందించిన సంక్షేమ లబ్ధిని తెలియజేసే పత్రాన్ని అందించారు.

రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట



రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని జజ్జువ నుంచి గెడ్డగూడ రహదారి ప్రారంభించారు. కిండంగి గ్రామంలో గ్రామ సచివాలయాన్ని, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఎటువంటి పథకాలు అమలుకు నోచుకోకపోవడంతో అన్ని విధాల వెనుకబాటుకు గురయ్యామన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామాల్లో సమస్యలు పరిష్కారమై అన్ని విధాల అభివృద్ధి సాధించాయన్నారు. ప్రతీ గ్రామానికి తాగునీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యం వంటివి కల్పించడం జరిగిందన్నారు. ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎంపీటీసీ హరిబాబు, చంద్రశేఖర్, పార్టీ నాయకులు ఎస్.రాము, సింహాచలం, చెంచయ్య, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా వైఎస్సార్ బీమా



మృతుని భార్య సుశీలకు ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్ ప్రభావతి

భామిని: మండలంలోని అత్తికొత్తూరుకు చెందిన గిరిజనుడు ఆరికి వీరయ్య(43) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. మృతుని భార్య ఆరిక సుశీలకు వైఎస్సార్ బీమా సాయం కింద రూ.10వేలు నగదును తాలాడ సర్పంచ్ ఎరుకుమజ్జి ప్రభావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాపినాయుడు అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ బిడ్డిక మోహన, వలంటీరు గౌతమి తదితరులు ఉన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు దంపతులు

జియ్యమ్మవలస: గరుగుబిల్లి మండలం లఖనాపురం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు సమక్షంలో బుధవారం రాత్రి చినమేరంగిలోని క్యాంపు కార్యాలయంలో వారు పార్టీలో చేరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి పార్టీలో చేరినట్టు వారు వెల్లడించారు. చేరిన వారిలో తలచింతల సింహాచలం, తిర్లింగి సింహాచలంతో పాటు 20 కుటుంబాలు వారు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపీపీ ఉరిటి రామారావు, నాయకులు గౌరునాయుడు, ఎస్.జనార్దననాయుడు తదితరులు పాల్గొన్నారు.

శివపూజకు వేళాయె...



కొమరాడ: నాగావళి - జంఝావతి నదుల మధ్య కొలువుదీరిన గుంప సోమేశ్వరాలయం

కొమరాడ: నాగావళి, జంఝావతి నదుల సంగమం వద్ద వెలసి ఉన్న గుంప సోమేశ్వరాలయం మహా శివరాత్రి పూజలకు సిద్ధమైంది. కొమరాడ మండలం కోటపాం పంచాయతీ దేవుని గుంపలో ఉన్న ఈ ఆలయం ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందింది. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు సోదరుడు బలరాముడు గోహత్య దోష నివారణ కోసం శివుని ప్రార్థించగా నదీ తీరాన ఐదు శివలింగాలు ప్రతిష్ఠించాలని హితబోధ చేశాడని భక్తుల నమ్మకం. బలరాముడు తన నాగళితో దున్నడంతో నాగావళి నది ఏర్పడినట్లు, మార్గ మధ్యలో అటంకాలు ఎదురైన చోట శివలింగాలను ప్రతిష్ఠించినట్లు భక్తుల విశ్వాసం. అలా నది వెంబడి ఒడిశా రాష్ట్రంలోని పాయకపాడులో భీమేశ్వరుడు, దేవునిగుంప వద్ద సోమేశ్వరుడు, వంగర మండలం సంగాం వద్ద సంగమేశ్వరుడు, శ్రీకాకుళం వద్ద రుద్రకోటీశ్వరుడు, కళ్లేపల్లి వద్ద శ్రీనాగేశ్వరునిగా పూజలు అందుకుంటున్నాడు. వీటిలో దేవుని గుంపకు ప్రత్యేకత ఉంది. ఇక్కడ వెలసి ఉన్న సోమేశ్వరున్ని దర్శించుకుంటే కాశీ యాత్ర చేసినంత పుణ్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. శివరాత్రికి ఇక్కడ అన్ని ఏర్పాట్లు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పూర్తి చేశారు.

ముస్తాబవుతున్న శివాలయాలు

గరుగుబిల్లి: మండలంలోని పలు శివాలయాలు మహాశివరాత్రికి ముస్తాబవుతున్నాయి. మండలంలోని నాగూరులోని శ్రీచంద్రశేఖరస్వామి, గొట్టివలసలోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి, శివ్వాంలోని ఆలయాలు సిద్ధం చేశారు.

ప్రకృతి సిద్ధ శైవ క్షేత్రం మిన్నాజోల



భామిని : మిన్నాజోల క్షేత్రంలో మీనకేశ్వరునికి పూజలు చేస్తున్న ఆంధ్రా భక్తులు(ఫైల్)



గరుగుబిల్లి: ముస్తాబైన గొట్టివలస శివాలయం

భామిని : వంశధార నదీ జన్మస్థలంగా పిలవబడుతున్న ఒడిశాలోని మిన్నాజోల ప్రకృతి సిద్ధ శైవ క్షేత్రంలో వెలిసిన మీనకేశ్వరుని సన్నిధిలో గురువారం నుంచే ఆంధ్రా భక్తులు పూజలు ఆరంభించారు. భామిని మండలం బత్తిలి నుంచి 60 కిలోమీటర్ల దూరంలో గల ఒడిశా గుదారి సమీపం చంద్రపూర్ అటవీ ప్రాంతం వంశధార నదీ తీరంలో ఈ క్షేత్రం వెలిసింది. మూడు నదుల త్రివేణి సంగమం నుంచి వంశధార నది రూపాంతరం చెందిన చోట మిన్నాజోల క్షేత్రం ఏర్పడింది.